# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయండి

**కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో ఎమ్మెల్యే లాస్య నందిత**

కంటోన్మెంట్,డిసెంబర్ 18: కంటోన్మెంట్ నియోజకవర్గానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే లాస్యనందిత కోరారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో ఎమ్మెల్యే భేటీ అయ్యారు.ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా బోర్డు కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే లాస్య నందితకు సీఈఓ మధుకర్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు.ఆ తర్వాత ఎమ్మెల్యే లాస్య నందిత ప్రజా సమస్యల గురించి ప్రస్తావించారు.రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు,కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ సమస్యల గురించి మాట్లాడారు.వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. స్పందించిన బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత,సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్,పనస సంతోష్, మల్లేష్,రవి కుమార్,కర్ణ కుమార్,దేవుల పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే లాస్య నందిత

## అభివృద్ధికి నిరంతరం కృషి

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



సుబ్రహ్మణ్యా స్వామి షష్టి మహోత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 18: మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్యా స్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యా షష్టి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందితలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక ఆలయ చైర్మన్ సి. సంతోష్ యాదవ్, ఆలయ ఈఓ అరుణ కుమారి, పాలక మండలి సభ్యులు వేణుగోపాలచారి, నాగేందర్ యాదవ్, జే. భాస్కర్, పద్మజ, చొల్లేటి రమేష్, నర్సింగ్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు టి. రాజేశ్వర శర్మ, బీఆర్ఎస్ నాయకులు టీఎన్. శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, ఆకుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా జిమ్ పరికరాలు అందజేత



జిమ్ పరికరాల అందజేత అనంతరం ఉచిత వ్యాయామశాలను ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి

సికింద్రాబాద్,డిసెంబర్18: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మైలార్‌గడ్డలో ఉన్న పురాతన మారుతీ వ్యాయామశాలకు జిమ్ పరికరాలను సికింద్రాబాద్ బీజేపీ నాయకుడు చంద్రారెడ్డి ఉచితంగా అందజేశారు. ఈ మేరకు వ్యాయామశాలలో జరిగిన ఓకార్యక్రమంలో మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిది దశాబ్ధాల క్రితం ఏర్పాటైన మారుతీ వ్యాయామశాల రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులను అందించిందన్నారు. వ్యాయామశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామశాల డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు నిర్మల్ కుమార్‌గౌడ్,మాదిరెడ్డి జలందర్‌రెడ్డి,టీవీశ్రీను,తూర్పాటి శివకుమార్, జాషు మోజెస్, శంకర్‌రెడ్డి,బ్యాంకు రమేష్,జ్ఞానేశ్వర్,నరహరి, మహేష్,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ స్పీకర్‌కు సన్మానం

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను పలువురు నాయకులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గడ్డం ప్రసాద్‌ను సికింద్రాబాద్‌కు చెందిన నాయకులు సందిరి శంకర్,విఠల్ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు చెప్పారు.
– సికింద్రాబాద్,డిసెంబర్18:

## 'దవాఖానలో మౌలిక వసతులు కల్పించండి'



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18: తుకారాంగేట్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తార్నాక డివిజన్ లాలాపేటలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో డ్రెస్సింగ్ రూమ్, మంచినీరు, రోగులకు బాత్రూంలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జయశ్రీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

**అధికారులతో కార్పొరేటర్ సామల హేమ**

సికింద్రాబాద్,డిసెంబర్18: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని నామాలగుండు వార్డు కార్యాలయంలో సోమవారం సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కార్పొరేటర్ సామల హేమ సమీక్షా సమావేశం నిర్వహించారు. నామాలగుండులోని వార్డు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వార్డు కార్యాలయ అధికారి సంధ్యతో వార్డు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎంత వరకు పరిష్కారం అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా పని చేయాలని వార్డు కార్యాలయ సిబ్బందిని కార్పొరేటర్ సామల హేమ ఆదేశించారు .ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, యూసీడీ అధికారి ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వార్డు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

## దుప్పి కొమ్ములా పెరిగిన కిడ్నీ రాళ్లు

- ఝార్ఖండ్ విద్యార్థికి ఏఐఎన్‌యూ ఆస్పత్రిలో చికిత్స
- విజయవంతంగా రాళ్లను తొలగించిన వైద్యులు



బొల్లారం, డిసెంబర్ 18: ఓ విద్యార్థి మూత్ర పిండాల్లో భారీ పరిమాణంలో ఉన్న రాళ్లను కీహోల్ సర్జరీ ద్వారా సికింద్రాబాద్ ఏఐఎన్‌యూ ఆస్పత్రి యూరాలాజిస్టు వైద్యులు తొలగించారు. ఆ ఆస్పత్రి యూరాలాజిస్టు వైద్యులు సూరజ్ పిన్ని, రాఘవేంద్ర కులకర్ణి, గోపాల్ తక్, శ్రీనివాస రావు బృందం 3 గంటలు శ్రమించి విజయవంతంగా శస్త్ర చికిత్సను నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఝార్ఖండ్‌కు చెందిన ఈ ఫార్మాసీ విద్యార్థి కిడ్నీ సమస్యతో ఏఐఎన్‌ఎయూ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షలు చేయగా అతడికి మూత్ర పిండాల్లో రాళ్లు ఉన్నాయన్న విషయం బయటపడింది. అసాధారణ పరిమాణం (9.5 x 6X4 సెం.మీ.)లో ఆ రాళ్లు.. దుప్పి కొమ్ము తరహాలో ఉన్నట్లు గుర్తించారు. కీహోల్ సర్జరీ ద్వారా వైద్యులు ఆ రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా సోమవారం కార్ఖానా విక్రంపురిలో విలేకరుల సమావేశంలో వైద్యులు సూరజ్ పిన్ని మాట్లాడుతూ.. జన్యుపరమైన కారణాలు, పర్యావరణం, ఆహారపు అలవాట్ల వల్ల కూడా రాళ్లు ఏర్పడుతాయన్నారు. 3డీ రీ కన్‌స్ట్రక్షన్ ఇమేజింగ్ లాంటి పరీక్షలు చేసి, కీహోల్ సర్జరీ ద్వారా 4 నుంచి 5మిల్లీ మీటర్ల పరిమాణంలో 5 రంధ్రాలు చేశామని, వాటి ద్వారా మొత్తం రాళ్లను చిన్నవిగా పగులగొట్టి 3 గంటలు శ్రమించి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేసినట్టు తెలిపారు. సదరు విద్యార్థి పూర్తిగా కోలుకున్నట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## పిల్లలతో సహా.. మహిళ అదృశ్యం



ఇంటి నుంచి వెళ్లిపోయిన పిల్లలు, గృహిణి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18: భర్తతో గొడవపడి క్షణికావేశంలో పిల్లలతో సహా గృహిణి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కాశీ తెలిపిన వివరాల ప్రకారం తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌లో గోపి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తు న్నాడు. అతడికి 2006లో సోని (32)తో వివాహమైంది. వారికి ఇద్దరు కూతుర్లు కేజియా (14), దివ్యగిరీశ్ (13) సంతానం. కొన్ని నెలలుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం మళ్లీ వారిద్దరి మధ్య గొడవ జరగడంతో తిరిగి పిల్లలను తీసుకుని సోని ఇంటి నుంచి వెళ్లిపోయింది. గతంలో సోని నివసించిన విజయవాడతో పాటు ఆశ్రమం పొందిన హోం, బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గోపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పృథ్వీ తేజ



పృథ్వీ తేజ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18: ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఓయూ విద్యార్థి నాయకుడు పృథ్వీ తేజ నియమితులయ్యారు. అదే పదవిలో కొనసాగుతున్న పృథ్వీతేజను మరోసారి అదే పదవిలో కొనసాగించాలని ఏబీవీపీ జాతీయ మహాసభల్లో నిర్ణయించారు. ఈ సందర్భంగా పృథ్వీ తేజ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల తన పోరాటాన్ని కొనసాగిస్తానని చెప్పారు. తన మీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

- ఏబీవీపీ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్‌గా జీవన్‌ను ఎన్నుకున్నా రు. ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృతం విభాగంలో ఆయన ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు విద్యార్థి నాయకులు అభినందించారు.



జీవన్